

కమీషన్ల ఎమ్మెల్యే మళ్లీ కావాలా?

క్వారీ, శివాలయం భూములూ కొట్టేశారు

వైసీపీకి ఓటేస్తే మీకూ మిస్బా కుటుంబానికి పట్టిన గతే

పలమనేరులో ప్రజాగళం సభలో చంద్రబాబు

పలమనేరు, మార్చి 27: ప్రతి పనికీ 15 శాతం కమీషన్లు తీసుకునే ఎమ్మెల్యే మీకు కావాలా అని పలమనేరు ప్రజలను టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు. పలమనేరులో బుధవారం ప్రజాగళం పేరిట జరిగిన తొలి ప్రచార సభలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలను వివరించారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడపై తీవ్ర విమర్శలు చేశారు. 'ఇక్కడ ఉన్న ఎమ్మెల్యే ఒక పనికిరాని ఎమ్మెల్యే. ఇసుకను బెంగళూరుకు అక్రమంగా రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. రూ.5 కోట్ల విలువచేసే శివాలయం భూములు కొట్టేశారు. ఇక, జనార్దన నాయుడు అనే వ్యక్తి క్వారీని బలవంతంగా లాక్కున్నారు. అతడి క్వారీ కరెంటు బిల్లును కూడా కట్టకుండా బాధితుడి ఇంటికే బిల్లు పంపిన దుర్మార్గుడు మీ ఎమ్మెల్యే. గంగమ్మగుడి వద్ద, గంగవరం సమీపంలో రూ.కోట్ల విలువైన భూములను వైసీపీ నాయకులు కబ్జా చేసేశారు. ఇటువంటి ఎమ్మెల్యే మీకు మళ్లీ కావాలా?' అని చంద్రబాబు అడిగారు. ఇక్కడి ఎమ్మెల్యే వెంకటేగౌడ వైరస్‌కు మందు అమరనాథరెడ్డి అన్నారు. అవినీతిని అరికట్టాలంటే అమర్‌ను గెలిపించాలన్నారు. రాజీలేని పోరాటం చేసే కుటుంబం వీరిదంటూ అభినందించారు. ఇక వైసీపీ నాయకుల అక్రమాలు, అవినీతిని ప్రశ్నించిన పాపానికి ఆంధ్రజ్యోతి, రాజ్‌టీవీ, స్వతంత్రటీవీకి చెందిన ముగ్గురు విలేకరులపై అక్రమంగా కేసులు బనాయించారన్నారు. ఈ దుర్మార్గాన్ని ప్రశ్నించినందున టీడీపీ నాయకులపైనా కేసులు పెట్టారన్నారు. ఎస్సీలను చంపి పార్సిల్ పంపిన పార్టీ వైసీపీ అని.. అలాంటి పార్టీకి ఓటేస్తే పలమనేరులో మిస్బా కుటుంబానికి పట్టిన గతే మీకూ పడుతుందని చెప్పారు. స్థానికంగా ఉన్న మైనారిటీ బాలిక మిస్బాను వైసీపీ నాయకులు వేధించి.. ఆమె ఆత్మహత్య చేసుకునేలా చేశారని చంద్రబాబు గుర్తుచేశారు. చివరకు మిస్బా కుటుంబాన్ని అమరనాథరెడ్డి పరామర్శించాక.. వైసీపీ నాయకులు వెళ్లి వారిని ఆదుకొంటామని చెప్పి మోసం చేశారన్నారు. పూలు అమ్మిన చోట.. కట్టెలు అమ్ముకోలేక నేడు మిస్బా కుటుంబం పుంగనూరుకు వెళ్లిపోయిందన్నారు. 'ముసుగు వీరుడు జగన్ ఇక్కడికి రా. రాయలసీమ ఇరిగేషన్‌కు ఏం చేశావో చెప్పు. ఈ ప్రాంతానికి ఏం చేశావో సమాధానం చెప్పు' అని నిలదీశారు.

మేము ఏం చేస్తామంటే..

'ఇక్కడ 33 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న మార్కెట్‌ను విస్తరిస్తాం. వి.కోటలో మైనారిటీలకు జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తాం. కైగల్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తాం. ఇంతకు ముందు మేము మంజూరు చేసిన పనులన్నీ అధికారం లోకి రాగానే మళ్లీ మంజూరు చేయించి పూర్తి చేయిస్తాం' అని చంద్రబాబు చెప్పారు.

దుర్మార్గులకు అధికారం ఇస్తే..

పాముకు పాలు పోస్తే కాటు వేస్తుందని.. దుర్మార్గులకు అధికారం ఇచ్చినా అంతేనని చంద్రబాబు తెలిపారు. ఓటుకు రూ.5 వేల నుంచి రూ.10 వేలు ఇస్తామని చెబుతున్నారని, దీనికి మీరు అమ్ముడు పోతారా అని ప్రజలను ప్రశ్నించారు. ఇలా రూ.10 ఇచ్చి రూ.100 దోచుకొంటారని ప్రజలను అప్రమత్తం చేశారు. రూ.100 సంపాదించేలా ఉపాధి కల్పించే పార్టీ తెలుగుదేశం అని అన్నారు.

అందరికీ అందుబాటులో.. చిత్తూరులోనే ఉంటా

● దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎంపీ అభ్యర్థి

రాష్ట్రంలో నిరుద్యోగం, ఆర్థిక దుస్థితి చూసి, అకారణంగా చంద్రబాబుపై కేసులు పెట్టి అరెస్టు చేసిన ఘటనలు చూసి నేను రాజకీయాల్లోకి వచ్చా. చంద్రబాబు ఆశీస్సులతో చిత్తూరు పార్లమెంటు స్థానంలో పోటీ చేస్తున్నా. చిత్తూరులోనే ఉండి.. పార్లమెంటు ప్రజలందరికీ అందుబాటులో ఉంటా. ఈ రాష్ట్ర దుస్థితి మారాలంటే, రౌడీయిజం పోవాలంటే సమర్థ నాయకుడైన చంద్రబాబు కావాలి. పలమనేరు రైతులు పొరుగు రాష్ట్రాలకు వెళ్లి పట్టుగూళ్లను విక్రయించుకుంటున్నారు. వీరికోసం ఇక్కడే సిల్క్ పరిశ్రమను తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం. కైగల్ ద్వారా సాగునీరు అందించడం.. కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు కావాలంటే ఎమ్మెల్యేగా అమరనాథరెడ్డిని, ఎంపీగా నన్ను గెలిపించండి.



చంద్రబాబుతో దగ్గుమళ్ల ప్రసాదరావు, అమర్

ఎలాంటి అభివృద్ధీ లేదిక్కడ

● మాజీ మంత్రి అమరనాథరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి

ఐదేళ్ల జగన్ పాలనలో పలమనేరు నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదు. ప్రధానంగా మౌళిక సదుపాయాల కల్పన ఆగిపోయింది. సెరికల్చర్ రైతులకు 2020 తర్వాత రావాల్సిన రూ.12కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని ఇంతవరకు ఇవ్వలేదు. గత ప్రభుత్వ హయాంలో కళాక్షేత్రంకు స్థలం కేటాయిస్తే ఇప్పటివరకు నిర్మించలేద. ముస్లింలకు షాదీమహల్ నిర్మాణం ప్రారంభిస్తే మొండిగోడలకే నిలిపేశారు. వి.కోటలో మైనారిటీ బాలికలకు మంజూరు చేసిన ఉర్దూ జూనియర్ కళాశాలను ప్రారంభించలేదు. మంజూరైన డిగ్రీకళాశాలనూ పట్టించుకోలేదు. తాగునీటి కోసం గంగన్న శిరస్సు ప్రాజెక్టు.. సాగునీటికోసం కైగల్ ప్రాజెక్టుకు శంకుస్థాపనచేస్తే నేటికీ పనులు చేపట్టలేదు. పలమనేరులో బీసీ.. అంబేడ్కర్ భవనాలనూ శంకుస్థాపనల వద్దే ఆపేశారు. గ్రామీణ ప్రాంత రోడ్లకు గత ప్రభుత్వంలో రూ.139 కోట్లు మంజూరుచేస్తే ఒక్క రోడ్డూ వేయలేదు. చేసిన రోడ్లకు బిల్లులు ఇవ్వలేదు. టిడ్కో ఇళ్లకు డిపాజిట్లు కట్టిన వారికి ఇళ్ల నిర్మాణం చేసివ్వలేదు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ.100 కోట్లు మంజూరు చేస్తే.. ఆ జీవోలను ఈ ప్రభుత్వం రద్దు చేసింది. తెలుగుదేశం పార్టీ సెక్యులర్ పార్టీ. ముస్లిం, క్రిస్టియన్లందరికీ సమాన అవకాశాలు ఇస్తాం. వారికి అండగా ఉంటాం.



టీడీపీలో చేరిన వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధులు

చంద్రబాబు సమక్షంలో వైసీపీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి, మున్సిపల్ కౌన్సిలర్ బీఆర్సీకుమార్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు శ్రీరాములురెడ్డి, పెద్దపంజాణి మండలం సామరాజుపల్లికి చెందిన గోవిందరెడ్డి, బొమ్మిదొడ్డికి చెందిన సి.నందకుమార్ తదితరులు పార్టీలో చేరారు. వీరికి చంద్రబాబు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.



లైవ్‌కు అంతరాయం కలిగించిన కేబుల్ ప్లగ్



ప్రజాగళం లైవ్‌కు అంతరాయం

ప్రజాగళం సభలో చంద్రబాబు ప్రసంగం ప్రారంభించిన కొద్దినిముషాలకే లైవ్‌లో అంతరాయం ఏర్పడింది. చంద్రబాబు మాటలు వినిపించకపోవడంతో వెంటనే సాంకేతిక సిబ్బంది స్పందించి తనిఖీ చేశారు. లైవ్‌కు ఏర్పాటు చేసిన ఒకకేబుల్‌కు ఉన్న జాయింట్ తొలగి ఉండటాన్ని గుర్తించి వెంటనే పునరుద్ధరించారు. ఈ జాయింట్ వద్ద ఉన్న ప్లగ్ లాంటి పరికరాన్ని ఆకతాయిలు తొలగించారా? లేదా ఉద్దేశపూర్వకంగా ఎవరైనా తొలగించారా అనేతి తెలియడం లేదు.

బాబు పర్యటన ఇలా..

కుప్పం నుంచి చంద్రబాబు హెలికాప్టరులో పలమనేరుకు బుధవారం ఉదయం 11.45 గంటలకు చేరుకున్నారు. హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గాన జవుళివీధిలోని సభ వద్దకు చేరుకున్నారు. 12 నుంచి ఐదు నిమిషాల పాటు పార్లమెంట్ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, 12.20 వరకు మాజీ మంత్రి అమరనాథరెడ్డి ప్రసంగించారు. 12.20 నుంచి 1.30 వరకు చంద్రబాబు ప్రసంగం సాగింది. అనంతరం హెలికాప్టరులో బయలుదేరి 2.30 గంటలకు పుత్తూరుకు వెళ్లారు. అక్కడ సభ ముగించుకుని సాయంత్రం హెలికాప్టరులో మదనపల్లెకు వెళ్లారు.

కన్నీళ్లు దిగమింగుకుని.. టెన్త్ పరీక్ష రాసి..!

● మమతను ఓదార్చిన టీచర్లు



పరీక్షలకు హాజరైన మమత

గంగాధరనెల్లూరు, మార్చి 27: ఇంటి వద్ద తండ్రి మృతదేహం. ఉబికివస్తున్న కన్నీళ్లను దిగమింగుకుందా బాలిక. బుధవారం ఉదయం పదో తగతి పరీక్షకు హాజరైందామె. గంగాధరనెల్లూరు మండలం వి.లక్ష్మీరెడ్డిపల్లె దళితవాడకు చెందిన మహేంద్రన్ మంగళవారం ట్రాక్టర్‌లో కూర్చొని ఇంటికి వెళుతుండగా జారిపడి మరణించిన విషయం తెలిసిందే. పరీక్ష రాసిన కుమార్తె మమతను తీసుకుని వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం జరిగాక మృతదేహాన్ని ఇంటివద్దకు చేర్చారు. తండ్రి మహేంద్రన్ శవాన్ని ఇంట్లో పెట్టుకుని కన్నీళ్ళు దిగమింగుకుని మమత గంగాధరనెల్లూరు హైస్కూల్‌కు వచ్చి బుధవారం పదో తరగతి సోషియల్ పరీక్ష రాసింది. పరీక్షల విధులకు హాజరైన టీచర్లు ఆమెను ఓదార్చి.. ధైర్యం చెప్పారు. పరీక్షల అనంతరం మమత తండ్రి అంత్యక్రియల్లో పాల్గొంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం) : సా. 6.29

సహరి (శుక్రవారం) : ఉ. 4.51



పట్టుబడిన ఆర్ఐ


ఏసీబీ వలలో ఆర్ఐ

కార్వేటినగరం, మార్చి 27: కార్వేటినగరం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టరుగా పనిచేస్తున్న రెడ్డెప్ప బుధవారం ఏసీబీ అధికారులకు చిక్కారు. ఓ రైతు నుంచి రూ.12 వేలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పాస్‌బుక్ మార్పిడి కోసం రైతును తిప్పించుకుంటున్న ఆయన.. డబ్బు డిమాండు చేశారు. దీనిపై ఆ రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ క్రమంలో బుధవారం కార్వేటినగరంలోని జాతీయ రహదారిలో టీ షాపు వద్ద ఆర్ఐ టీ తాగుతున్నారు. ఆ రైతు నుంచి వసూలు చేసిన రూ.12 వేల నగదును ఆయన తన ద్విచక్ర వాహనంలోని పెట్రోల్ ట్యాంకు వద్ద ఉంచారు. ఆ సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి ఆ మొత్తాన్ని చేసుకున్నారు.

ముగిసిన టెన్త్ పరీక్షలు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 27: జిల్లాలో ఈనెల 18న ప్రారంభమైన టెన్త్ పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. సోషియల్ పరీక్షకు 21,620 మంది విద్యార్థులకు గాను 21,111 మంది హాజరు కాగా, 509 మంది గైర్హాజరైనట్లు డీఈవో దేవరాజు, పరీక్షల సహాయ కమిషనర్ చాముండేశ్వరి తెలిపారు. కాగా 28, 30న ఆప్షనల్ పరీక్షలు జరగనున్నాయి.

చిత్తూరు ఎస్పీకి వెండి పతకం



ఎస్పీ జాషువా

చిత్తూరు, మార్చి 27: జిల్లా వ్యాప్తంగా 13 మంది పోలీసు అధికారులకు, సిబ్బందికి డీజీపీ పతకాలను ప్రకటించారు. వీరికి ఎస్పీ జాషువాకు వెండి పతకాన్ని ప్రదానం చేయనున్నారు. పాలసముద్రంలో కానిస్టేబుల్ డి.వెంకటేశులుకు వెండి పతకం లభించింది. మిగిలిన 11 మందికి కాంస్య పతకాలను ప్రకటించారు. వీరిలో డీఎస్పీ సుధాకర్‌రెడ్డి (పలమనేరు), కార్వేటినగరం సీఐ చంద్రశేఖర్, చిత్తూరు ఏఆర్ ఎస్ఐ రమేష్, పుంగనూరు అర్బన్ ఏఎస్ఐ ఎం.కె.వెంకటరత్నం, జీడీ నెల్లూరు హెడ్‌కానిస్టేబుల్ జగదీశ్, చిత్తూరు ట్రాఫిక్ కానిస్టేబుల్ మధుకుమార్, గంగవరం కానిస్టేబుల్ అల్లావుద్దీన్, ఎస్ఆర్‌పురం కానిస్టేబుల్ మోహన్‌బాబు, చిత్తూరు ఒకటో పట్టణ కానిస్టేబుల్ రామకృష్ణ, వి.కోట అర్బన్ పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ ప్రతాప్‌కుమార్, చిత్తూరులో ఏఎస్ఐ మనోహర్ ఉన్నారు.

చంద్రబాబుకు సాదర వీడ్కోలు



కుప్పం, మార్చి 27: కుప్పంలో సోమ, మంగళవారాల్లో తన పర్యటన ముగించుకొని బుధవారం ప్రజాగళం ప్రచార సభకు బయలుదేరిన టీడీపీ అధినేత చంద్రబాబుకు ఆ పార్టీ నాయకులు నాయకులు సాదరంగా వీడ్కోలు పలికారు. ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద చంద్రబాబు ఉదయం కొద్దిసేపు స్థానిక నేతలతో సమావేశమయ్యారు. అనంతరం పదిన్నర గంటల ప్రాంతంలో బయలుదేరి పీఈఎస్ వద్ద గల హెలిప్యాడ్ కు చేరుకున్నారు. ఇక్కడ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో కాసేపు మాట్లాడారు. అనంతరం హెలికాప్టరులో పలమనేరుకు బయలుదేరారు.



పుత్తూరు కాపు వీధి కూడలిలో ప్రజాగళం సభకు పోటెత్తిన జనం - టీడీపీ నగరి అసెంబ్లీ అభ్యర్థి గాలి భానుప్రకాష్, చిత్తూరు ఎంపీ అభ్యర్థి ప్రసాదరావులను చూపించి గెలిపించమని కోరుతున్న చంద్రబాబు

జబర్దస్త్ రోజా
నగరికి ఏం చేశారు?

ఎలక్ట్రానిక్ క్లస్టర్‌కు భూములిస్తే నగరి, తిరుపతి ఎమ్మెల్యేలు దోచేశారు

ఇండస్ట్రియల్ పార్కుకు 1500 ఎకరాలిస్తే ఒక పరిశ్రమైనా పెట్టారా?

ప్రజాగళం సభలో నిప్పులు చెరిగిన చంద్రబాబు

పుత్తూరు అర్బన్, మార్చి 27 : జబర్దస్త్ ఎమ్మెల్యే నగరి నియోజకవర్గ అభివృద్ధికి ఏమైనా చేశారా అంటూ టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూటిగా ప్రశ్నించారు. బుధవారం సాయంత్రం పుత్తూరులో జరిగిన ప్రజాగళం బహిరంగసభలో ఆయన ప్రసంగిస్తూ వడమాలపేట మండలంలో ఎలక్ట్రానిక్ క్లస్టర్ కోసం గత ప్రభుత్వంలో తాము 150 ఎకరాల భూములు కేటాయిస్తే నగరి, తిరుపతి ఎమ్మెల్యేలు డబ్బు కొట్టేసి పాదిరేడు అరణ్యాన్ని దోచుకున్నారని ఆరోపించారు. విజయపురం మండలంలో ఇండస్ట్రియల్ పార్కు కోసం గతంలో తమ ప్రభుత్వం 1500 ఎకరాల భూములు కేటాయిస్తే ఈ ఐదేళ్లలో కనీసం ఒక పరిశ్రమైనా పెట్టారా? ఒక ఉద్యోగమైనా ఇచ్చారా? అంటూ నిలదీశారు. చెన్నైకి కేవలం 60 కిలోమీటర్ల దూరంలో వున్న ఈ ప్రాంతంలో పారిశ్రామికవాడ ఏర్పాటు చేస్తే చదువుకున్న యువత ఉపాధి కోసం తమిళనాడు వెళ్లకుండా స్థానికంగానే ఉద్యోగావకాశాలు పొందుతారన్న దూరదృష్టితో భూములు కేటాయిస్తే పరిశ్రమలను రప్పించడంలో వైసీపీ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారని దుయ్యబట్టారు. గాలేరు-నగరి సాగునీటి ప్రాజెక్టు పూర్తి చేస్తామని, నగరిలో చేనేత కార్మికులకు 500 యూనిట్లు ఉచితంగా విద్యుత్ అందిస్తామని ఇక్కడి నుంచే హామీ ఇచ్చిన వైఎస్ జగన్ హామీ ఏమైందని ప్రశ్నించారు. గాలేరు-నగరి ప్రాజెక్టు పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని, వేణుగోపాల సాగర్ ప్రాజెక్టు పనులు ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఇస్తామని ఎమ్మెల్యే తన నుంచీ రూ. 40 లక్షలు తీసుకుని మోసగించారంటూ భువనేశ్వరి అనే అమ్మాయి తన వద్దకు వచ్చి ఆవేదన వ్యక్తం చేసిందని చెబుతూ వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్ అయిన భువనేశ్వరిని వాహనంపైకి పిలిపించారు.ఆమెను ప్రజలకు చూపిస్తూ ఇలాంటి ఆడబిడ్డను మోసగించిన వారికి ఓటేస్తారా అంటూ ప్రశ్నించారు. మోసపోయిన ఆడబిడ్డకు అండగా వుంటారా లేదా అని ప్రశ్నించారు. ఇలాంటి ఎమ్మెల్యేలను ప్రోత్సహించిన జగన్‌ను కూడా గుర్తు పెట్టుకోవాలని ప్రజలకు పిలుపిచ్చారు. నగరి నియోజకవర్గంలో ఎక్కడ చూసినా గ్రావెల్ వంటి వనరుల దోపిడీ జరుగుతోందని, నియోజకవర్గమంతా అరాచకం నెలకొన్నదని ఆరోపించారు.

మండుటెండలో సైతం తరలివచ్చిన అశేష జనం

పుత్తూరు పట్టణం కాపు వీధి కూడలిలో నిర్వహించిన ప్రజాగళం బహిరంగసభకు జనం పోటెత్తారు. మిట్టమధ్యాహ్నం మండుటెండలో సైతం మహిళలు, వృద్ధులు, పిల్లలు అనే తేడా లేకుండా పార్టీ కార్యకర్తలతో పాటు సామాన్య జనం కూడా తరలి రావడంతో పట్టణం కిక్కిరిసిపోయింది. జన స్పందన చూసి చంద్రబాబు సంతృప్తి చెందగా స్థానిక టీడీపీ నేతలు సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.ప్రజాగళం రోడ్‌షో, సభ విజయవంతం కావడం పట్ల చంద్రబాబు నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. చంద్రబాబు సభావేదిక మీదకు రాగానే భానుప్రకాష్ ఆయనకు కరవాలం బహూకరించగా, చంద్రబాబు కత్తిని దూసి యుద్ధానికి సిద్ధమని సింబాలిక్‌గా చూపారు. దీంతో కార్యకర్తల ఈలలు, కేకలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది.

పేదల మనిషి ముద్దుకృష్ణమ

నగరి నియోజకవర్గం అంటేనే గాలి ముద్దుకృష్ణమ నాయుడు గుర్తుకొస్తారన్నారు చంద్రబాబు . తన మిత్రుడైన ముద్దుకృష్ణమ పేదల మనిషిగా పేరుపడ్డారని కొనియాడారు. నగరిలో చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఎన్నోసార్లు తన వద్ద ప్రస్తావించారని గుర్తు చేసుకున్నారు. నగరిలో టెక్స్‌టైల్ ఇండస్ట్రీ వున్నందున దానికి సంబంధించిన పార్కు ఏర్పాటు చేస్తామని తద్వారా యువత స్థానికంగానే ఉద్యోగాలు పొందే పరిస్థితి సృష్టిస్తామన్నారు. చేనేత, మరమగ్గాల కార్మికులకు 500 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. చేనేత కార్మికులకు మేలు చేసే విధంగా ప్రత్యేక ప్యాకేజీ రూపొందించి అమలు చేస్తామన్నారు. వేణుగోపాల సాగర్ ప్రాజెక్టు పూర్తి చేయించి నగరి నియోజకవర్గంలో ప్రతి ఎకరానికీ సాగునీరందిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. నగరి, పుత్తూరు పట్టణాల్లో ప్రజల దాహార్తి తీర్చడానికి సమ్మర్ స్టోరేజీ ట్యాంకులున్నాయని, అయితే వాటిలోకి నీరు రావడం లేదన్నారు. వాటిని కూడా పూర్తి చేస్తామన్నారు. ఎన్టీఆర్ తిరుమలలో భక్తులకు అన్నదానం ప్రవేశపెట్టారని, అయితే టీటీడీ ఇపుడు దాన్ని సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. అలాగే తాను సీఎంగా వుండగా స్విమ్స్‌లో ప్రాణదాన పథకం పెట్టానని, దాన్ని నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే వాటిని సరిదిద్దుతామన్నారు.నగరి నియోజకవర్గం పుత్తూరులో ప్రజాగళం బహిరంగసభ చూస్తే సీఎం జగన్‌కు మైండ్ బ్లాంక్ అవడం ఖాయమన్నారు. బహిరంగసభలో నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్, చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ కౌన్సిలర్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ అంకయ్య

పుత్తూరు మున్సిపాలిటీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లతో పాటు మాజీ చైర్మన్ అంకయ్య బుధవారం టీడీపీలో చేరిపోయారు.చంద్రబాబు సమక్షంలో 17వ వార్డు కౌన్సిలర్ భువనేశ్వరి, 11వ వార్డు కౌన్సిలర్ జాన్ కెనడీతో పాటు మున్సిపల్ మాజీ చైర్మన్ అంకయ్య, రిటైర్డ్ టీచర్, అంబేడ్కర్ ట్రస్ట్ భవన్ కోశాధికారి కుప్పయ్య తదితరులు నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి చిన్నరాజుకుప్పం హెలిపాడ్ వద్ద చంద్రబాబు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఒకటి నుంచి ప్రాక్టికల్స్ తరగతులు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 27: బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల సెంటర్‌లోని ఫస్టియర్ డిగ్రీ విద్యార్థులకు ఫస్టు సెమిస్టర్ ప్రాక్టికల్స్ తరగతులు ఏప్రిల్ ఒకటి నుంచి మే నెల 4వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్ మీరాసాహెబ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. ఏప్రిల్ 12న రంజాన్, 17న శ్రీరామనవమి సందర్భంగా సెలవులు ఉంటాయన్నారు.

చెక్‌పోస్టులో పట్టుబడ్డ చీరలు

కుప్పం, మార్చి 27: కుప్పం మండలం నడిమూరు చెక్‌పోస్టు వద్ద జరిపిన తనిఖీలలో చీరలు పట్టుబడ్డాయి. ఒక వాహనాన్ని పోలీసులు నిలిపి తనిఖీ చేశారు. అందులో మూడు చిన్న గోనెపట్ట సంచులు కనిపించాయి. అనుమానం వచ్చి వాటిని విప్పి చూడగా చీరలు ఉన్నాయి. తనిఖీల్లో పట్టుబడిన చీరలకు పక్కా బిల్లులు ఉండడంతో సొంతదారుకు ఇచ్చి పంపేశామని అర్బన్ సీఐ షణ్ముగం తెలిపారు.

రైతు భరోసా కేంద్రానికి వైసీపీ రంగు



శ్రీరంగరాజపురం, మార్చి 27: ఎస్ఆర్‌పురం లోని రైతు భరోసా కేంద్రానికి వైసీపీ రంగులు అలాగే ఉన్నాయి. ఇది కోడ్ ఉల్లంఘన కాదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

కాంగ్రెస్‌లోకి డిప్యూటీ సీఎం మేనల్లుడు

వైసీపీలో ఎస్సీలకు న్యాయం జరగనందునే చేరానన్న రమేష్



వెదురుకుప్పం/కార్వేటినగరం, మార్చి 27: డిప్యూటీ సీఎం నారాయణస్వామికి మేనల్లుడు రమేష్ కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాదులో రెండు రోజుల కిందట ఆయన పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్వేటినగరం మండలం పాదిరికుప్పానికి చెందిన ఆయన వైసీపీలో ఉన్నారు. డిప్యూటీ సీఎంకు అసమ్మతి వర్గంగా మారిన వారిలో ఒకరు. నారాయణస్వామికి వైసీపీ టికెట్ ఇవ్వరాదంటూ మీడియాకు ఎక్కారు. ఈ క్రమంలో నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మికి గంగాధరనెల్లూరు టికెట్ ప్రకటించారు. ఈ క్రమంలో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. రాబోయే ఎన్నికల్లో గంగాధరనెల్లూరు నుంచి పోటీ చేయాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, వైసీపీలో ఎస్సీ సామాజిక వర్గానికి న్యాయం జరగకపోవడంతో కాంగ్రెస్‌లో చేరినట్లు ఆయన బుధవారం చెప్పారు. డిప్యూటీ సీఎం వల్ల కూడా నియోజకవర్గంలోని ఎస్సీలకు న్యాయం జరగలేదని.. నాన్ లోకల్ అయిన ఆయన కుమార్తె వల్ల అసలు న్యాయం జరగదన్నారు. తమ సామాజిక వర్గానికి చెందిన వారి అభిప్రాయం మేరకు ఈనెల 24న కాంగ్రెస్‌లో చేరానన్నారు. గంగాధరనెల్లూరు అభ్యర్థిగా బరిలో ఉంటానని చెప్పారు. తనను ప్రచారం చేసుకోమని షర్మిల చెప్పారని రమేష్ వెల్లడించారు.

జనసేన పీఏసీ రీజనల్ కో-ఆర్డినేటర్‌గా ఆరణి కవిత



చిత్తూరు సిటీ, మార్చి 27: జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ రాయలసీమ రీజనల్ కో-ఆర్డినేటర్‌గా చిత్తూరుకు చెందిన ఆరణి కవిత నియమితులయ్యారు. ఈ మేరకు జనసేనాని పవన్ కల్యాణ్ బుధవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందచేశారు.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ శ్రేణుల దాడి

చంద్రబాబు పర్యటనకు వెళ్లినందుకే...



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హరీష్ - ప్రమీలమ్మ

శాంతిపురం, మార్చి 27: మండలంలోని శివరామపురంలో పలువురు వైసీపీ శ్రేణులు టీడీపీ కార్యకర్త హరీష్‌పై మంగళవారం దాడి చేశారు. బాధితుడు హరీష్ తెలిపిన వివరాల మేరకు...సోమ, మంగళవారాల్లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పం నియోజికవర్గ పర్యటనకు విచ్చేసారు ఆ పర్యటనకు శివరామపురం పంచాయతీ నుంచి టీడీపీ శ్రేణులు భారీ ఎత్తున బయలుదేరారు. ఈ మధ్య వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన హరీష్ కూడా వారితోపాటు వెళ్లారు. రెండురోజుల పర్యటన చూసుకుని మంగళవారం మధ్యాహ్నం ఇంటికి వెళ్లారు. అదే సమయంలో వైసీపీ శ్రేణులు గ్రామంలో స్థానిక వైసీపీ కార్యకర్త గణేష్ మరికొంత మందితో కలిసి ప్రచారం చేస్తున్నారు. ఆ సమయంలో హరీష్‌తో గణేష్‌వర్గం ఈసారి జగనే సీఎం... ఎన్నికల తరువాత నీ కథ చూస్తానంటూ హెచ్చరించాడు. అలా హరీష్, గణేష్ మధ్య మాటామాటా పెరగడంతో వాగ్వాదానికి దిగారు. ఆ సమయంలో హరీష్‌పై గణేష్ మారణాయుధాలతో దాడిచేశాడు. అడ్డు వచ్చిన హరీష్ తల్లి ప్రమీలమ్మపై కూడా దాడి చేశాడు. గాయపడిన తల్లీకొడుకులు స్థానికుల సహాయంతో కుప్పం ప్రభుత్వాస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. దాడి చేసిన వారిపై బాధితుడు హరీష్ రాళ్లబూదుగూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా శివరామపురంలో జరిగిన గొడవల్లో ఇరువర్గాలు ఫిర్యాదు చేసుకున్నారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని వారు తెలిపారు.

డీజేలు వాడితే కేసులు పెడతాం: జేసీ

చిత్తూరు రూరల్, మార్చి 27: రాజకీయ పార్టీలు మైక్, స్పీకర్‌కు అనుమతి తీసుకొని ప్రచారాల్లో డీజే స్పీకర్లతో వైలేషన్ చేస్తున్నారని, దీనిపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయని జేసీ శ్రీనివాసులు తెలిపారు. దీనిపై శనివారం జరిగిన రాజకీయ పార్టీల సమావేశంలో హెచ్చరించనున్నట్లు తెలిపారు. అయినా తీరు మారకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. చిత్తూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అయిన ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. ప్రచారాలు, ర్యాలీలు, సమావేశాల నిర్వహణకు 48 గంటల ముందే అనుమతులు తీసుకోవాలని చెప్పారు. కోడ్ ఉల్లంఘన జరుగుతుంటే ప్రజలు సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఏఆర్‌వో అరుణ, డీఎస్పీ రాజగోపాల్, చిత్తూరు, గుడిపాల తహసీల్దార్లు శ్రీనివాసులు రెడ్డి, విజయలక్ష్మి, చిత్తూరు ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోజువారి నివేదికల రికార్డులు నమోదు చేయాలి

చిత్తూరు కలెక్టరేట్: ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాటు చేసిన బృందాలు రోజువారి నివేదిక రికార్డులు సక్రమంగా నమోదు చేయాలని జేసీ శ్రీనివాసులు అన్నారు. బుధవారం డీఆర్వో పుల్లయ్యతో కలసి నోడల్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. త్వరలో జిల్లాకు ఎన్నికల పరిశీలకులు రానున్నారని, వారికి ఇకపై రోజువారి నివేదికల రిజిస్టర్లు అందించాల్సి ఉంటుందన్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఒక షిఫ్టు, రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల వరకు రెండో షిఫ్టుగా బృందాలు పనిచేయాలన్నారు.

ఇప్పటి వరకు రూ.36లక్షల నగదు సీజ్

తమ ప్రచారాలకోసం రాజకీయ పార్టీలు దరఖాస్తు చేసుకున్న వెంటనే ప్రాధాన్యత మేర ఆన్‌లైన్ ద్వారా అనుమతులిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అన్నారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు.అనుమతులు లేకుండా, ఎటువంటి బిల్లులు లేకుండా తీసుకువెళ్తున్న రూ.36లక్షల నగదును సీజ్ చేసినట్లు వెల్లడించారు. అందిన ఫిర్యాదులకోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని,సెల్ ద్వారా ఎప్పటికప్పుడు ఫిర్యాదులను బృందాలకు పంపి వెనువెంటనే పరిష్కారం చేస్తున్నట్లు చెప్పారు.

వలంటీర్లు రాజీనామా చేసి ప్రచారంలో పాల్గొనవచ్చు

చిత్తూరు రూరల్: వలంటీర్లు రాజీనామా చేసి ఎన్నికల ప్రచారంలో పాల్గొనవచ్చునని జేసీ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం పొందుతున్న వారు.. రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనకూడదన్నారు. రాజీనామా చేస్తే పాల్గొనవచ్చన్నారు. రాజీనామా చేసిన వారి స్థానాల్లో పక్క వార్డు వలంటీరుకు బాధ్యతలు అప్పగిస్తామన్నారు.

ఎస్‌పీ రబ్బర్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం



గంగాధరనెల్లూరు, మార్చి 27: జీడీనెల్లూరు మండలం సుందరరాజుపురం వద్దగల ఎస్‌పీ రబ్బరు ఫ్యాక్టరీలో బుధవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. ఫ్యాక్టరీ ఆవరణలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా నిప్పురవ్వలు పక్కనున్న గడ్డిపై పడి మంటలు వ్యాప్తిచెందాయి. ఫ్యాక్టరీ లోపల టైర్ల రబ్బర్‌పొడి బస్తాలతో పాటు యంత్రాలకూ మంటలు అంటుకున్నాయి. ఆ సమయంలో యజమాని, సిబ్బంది భోజనానికి వెళ్లారు. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. అప్పటికే చాలా వరకు రబ్బరు పొడి కాలిపోగా.. యంత్రాలూ దెబ్బతిన్నాయి. దీనిపై యాజమాన్యం ఫిర్యాదు చేయలేదని, ఎంత నష్టం వాటిల్లిందనే వివరాలూ చెప్పలేదని అధికారులు పేర్కొన్నారు.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.78.39 లక్షలు



ఆలయ ఆస్థాన మండపంలో స్వామి కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఐరాల(కాణిపాకం), మార్చి 27: కాణిపాక వరసిద్ధుడి ఆలయ హుండీ ద్వారా రూ.78,39,048 లభించింది. హుండీ కానుకలను ఆలయ ఆస్థాన మండపంలో బుధవారం లెక్కించారు. 14 గ్రాముల బంగారు, 910 గ్రాముల వెండి, 1,066 యూఎస్ఏ, 50 ఆస్ట్రేలియా డాలర్లు, 15 ఇంగ్లాండ్ ఫౌండ్లు, ఒక మలేసియా రింగిట్ లభించాయి. అలాగే గో సంరక్షణ హుండీ ద్వారా రూ.5,409, నిత్యాన్నదానసత్రం వద్ద హుండీ ద్వారా రూ.20,190 లభించాయి. ఈ ఆదాయం 14 రోజులలో లభించింది. ఈ లెక్కింపులో ఈవో వెంకటేశు, డీఈవో వాణి, ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, సూపరింటెండెట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మృత్యుంజయేశ్వరుడి హుండీ లెక్కింపు



చౌడేపల్లె, మార్చి27: స్థానిక బజారువీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు ద్వారా రూ.37వేలు వచ్చినట్లు ఈవో కమలాకర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ..76 రోజులకు గాను భక్తులు స్వామికి రూ.37,610 చెల్లించినట్లు తెలిపారు. ఈ ఆదాయాన్ని పుంగనూరు ఇండియన్ బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రూప్ టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌కుమార్‌రెడ్డి, అర్చకులు రాజశేఖర్ దీక్షితులు, కుమార్ స్వామి, మహేష్‌దీక్షితులు, సిబ్బంది హరిప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన పుంగనూరు శ్రీవారి బ్రహ్మోత్సవాలు

పుంగనూరు, మార్చి 27: పుంగనూరు కోనేరు వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 17 నుంచి ప్రారంభమై బుధవారం తిరుప్పావడ సేవతో ఘనంగా ముగిశాయి. టీటీడీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు మహాశాంతి అభిషేకం, హోమాలు, శ్రీవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం మంత్రోచ్చరణల మధ్య స్వామి వారికి తిరుప్పావడ సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి మంగళహారతులు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

జమీందారులకు సన్మానం



పుంగనూరు రూరల్, మార్చి27: వచ్చే నెలలో జరగనున్న సుగుటూరు గంగమ్మ గంగజాతర సందర్భంగా పుంగనూరు టీడీపీ నాయకులు జమీందారీ కుటుంబీకులను సన్మానించారు. బుధవారం స్థానిక నగిరిలోని జమీందారీ ప్యాలెస్‌లో ఉన్న జమీందారీ వంశస్థులు సోమశేఖర్‌రాయల్, మల్లికార్జునరాయల్, వీరేంద్ర రాయల్ కలసి దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేశాది ప్రకాశ్, గాజుల రమణ, మధుసూదన్‌గుప్తా, శ్రీనివాసులు, డికె.శ్రీనివాసులు, ప్రసాద్, నాగరాజు, చక్రి, శివ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన హిడింబాసుర వధ



హిడింబాసుర వధ ఘట్టంలోని ఓ సన్నివేశం

కల్లూరు, మార్చి 27: పులిచెర్ల మండలం దిగువపోకలవారిపల్లి పంచాయతీ ఎలకబైలు సమీపంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి హిడింబాసుర వధ ఘట్టం అందరినీ అలరించింది. కళాకారులు వేసిన భీమసేనుడు, హిడింబాసురుడు, హిడింబి తదితర పాత్రలు భక్తులను మెప్పించాయి. మధ్యాహ్నం భాగవతారిణి పూర్ణిమ పాండవ పర్యటన (బలిబండి) కథను వినిపించారు. పగలు కథకు రామిరెడ్డిగారిపల్లెకు చెందిన రమణయ్య, రాత్రి నాటకానికి దిగువపల్లెకు చెందిన ప్రభాకర్ కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

అర్చకుడిపై దాడి హేయం



మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

కుప్పం, మార్చి 27: కాకినాడలో వెలసిన బాలాత్రిపుర సుందరి ఆలయ అర్చకులు వెంకట సత్యసాయిపై మాజీ కార్పొరేటర్ చంద్రరావు దాడి చేసి కాలితో తన్నడం హేయమైన చర్య అని బ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీకాంత్, ప్రతాప్ నరసింహులు అన్నారు. ఈ దాడిని వాళ్లు తీవ్రంగా ఖండించారు. కుప్పంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సాత్వికుడైన ఒక ఆలయ అర్చకుడిపై దాడి చేశారంటే వైసీపీ నాయకులు ఎంత దౌర్జన్యకారులో తెలుస్తున్నది అన్నారు. ఇక సామాన్యులకు వారి నుంచి రక్షణ ఏమున్నదని ప్రశ్నించారు. అర్చకుడిపై దాడి చేసిన వారిని వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇద్దరిపై చీటింగ్ కేసు

చిత్తూరు, మార్చి 27: చీటీల పేరుతో పలువురుని మోసం చేసిన ఇద్దరిపై రెండో పట్టణ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ ఉలసయ్య వివరాల మేరకు.. చిత్తూరు నగరం రామ్‌నగర్ కాలనీకి చెందిన జమీల, నిజాముద్దీన్‌లు రెండేళ్ల క్రితం కాలనీలో చీటీలు వేశారు. వీరిని నమ్మి చాలా మంది రూ.60 లక్షల వరకు చీటీలు కట్టారు. చీటీ డబ్బులను తీసుకొని వీరు బెంగళూరుకు వెళ్లిపోయారు. రెండేళ్ల తరువాత కాలనీకి రావడంతో బాధితులంతా వారిపై ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆస్తి పన్నుపై వడ్డీమాఫీ

చిత్తూరు, మార్చి 27: చిత్తూరు నగరపాలక సంస్థలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులపై వడ్డీమాఫీ గడువు ఇక నాలుగు రోజులు మాత్రమే ఉందని, ఈ అవకాశాన్ని పన్నుదారులు ఉపయోగించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరానికి సంబంధించిన పన్నును ఒకేసారి చెల్లించిన వారికి వడ్డీమాఫీ ఉంటుందన్నారు. బకాయిల మొత్తాన్ని ఒకేసారి చెల్లించాల్సి ఉంటుందన్నారు. సెలవు రోజుల్లో కూడా పురసేవా కేంద్రం పనిచేస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మత్స్యశాఖలో అవినీతిపై ఫిర్యాదు

పుంగనూరు రూరల్ : పుంగనూరు మత్స్యశాఖలో అవినీతి జరిగిందని స్పందన ద్వారా ఫిర్యాదు చేసినట్లు దళిత సంఘ నాయకుడు శ్రీరాములు తెలిపారు. వెంకటేశ్వర మత్స్యపారిశ్రామిక సంఘం పేరుతో కొంతమంది బోగస్ సంస్థ ఏర్పాటు చేసి అధికారులతో కలిసి రూ.లక్షలు కాజేశారని తెలిపారు.

చంద్రబాబు ప్రసంగంతో యువతలో రెట్టింపు ఉత్సాహం

భానుడి భగభగలను లెక్కచేయని అభిమానం - మిద్దెల పైకెక్కి మరీ అభివాదం



మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు, కరెంటు తీగలను లెక్కచేయని అభిమానం, నీవే మా రాజు అంటూ దండం పెడుతున్న వృద్ధ అభిమాని

గంగవరం,మార్చి27: పలమనేరులో ప్రజాగళం ప్రారంభోత్సవం జరగడం ఊహించని ఉత్తేజాన్ని నింపిందని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. బుధవారం పలమనేరుకు వచ్చిన ఆయనకు ఊహించని రీతిలో యువత పెద్దసంఖ్యలో తరలివచ్చి మేము సైతం అండగా ఉంటాం అంటూ విక్టరీ సింబల్ చూపిస్తూ కేరింతలు కొట్టి జోష్ నింపారు. మండుటెండలో భానుడి భగభగలను లెక్కచేయకుండా అభిమానులు ఒక్క అంగుళం కూడా కదలకుండా చంద్రన్నా జై అంటూ, కూటమిదే విజయం అని నినాదాలు చేసి అభిమానం చాటుకున్నారు. పెద్దసంఖ్యలో తరలివచ్చి మిద్దెలపై, ఇనుప చువ్వలపై ఎక్కి చంద్రబాబును చూసి అభివాదం చేసి వీరాభిమానాన్ని చాటుకున్నారు. సుమారు గంటపాటు ఏమాత్రం అలసట లేకుండా నవ్వుతూ, వైఎస్సార్‌సీపీ అరాచాలను ఎండగడుతూ.. టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే పథకాలను చెప్పగానే యువత రెట్టింపు ఉత్సాహంతో విజయం మనదే అంటూ ముక్తకంఠంతో చెప్పడంతో సభా ప్రాంగణం మార్మోగింది.

ప్రజాగళం సభకు తరలివెళ్లిన బైరెడ్డిపల్లె టీడీపీ శ్రేణులు

బైరెడ్డిపల్లె : పలమనేరులో బుధవారం టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహించిన ప్రజాగళం సభకు బైరెడ్డిపల్లె మండలంనుంచి అధికసంఖ్యలో టీడీపీశ్రేణులు తరలివెళ్లారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి ఆధ్వర్యంలో అన్ని పంచాయతీలనుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పలు వాహనాల్లో తరలివెళ్లారు. జనసేన నాయకులు, కార్యకర్తలు కూడా వీరితో కలసివెళ్లారు.

భవిష్యత్తు బాగు కోసమే చంద్రబాబుకు ప్రజల మద్దతు



విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, మార్చి 27: తమ భవిష్యత్తు బాగు కోసమే చంద్రబాబుకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి మద్దతు తెలిపారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం అన్నారు. రెండు రోజుల చంద్రబాబు కుప్పం పర్యటనను విజయవంతం చేసిన మహిళలకు, యువతకు, అన్ని వర్గాల ప్రజలకు వారు ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ నాయకులు అనవసరమైన ప్రేలాపనలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కుప్పానికి 20 అంశాలతో కూడిన ప్రత్యేక మేనిఫెస్టో ఇవ్వడానికి తమ అధినేత చంద్రబాబు కసరత్తు చేస్తున్నారని పేర్కొన్నారు. అతి త్వరలో మేనిఫెస్టో విడుదల చేయడమే కాకుండా అధికారంలోకి వచ్చిన వెంటనే కచ్చితంగా ఆయా అంశాలను అమలుపరచి కుప్పాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. జగన్ సెట్టింగు వేసి ప్రారంభించిన హంద్రీనీవా డ్రామాను చంద్రబాబు బట్టబయలు చేశారని అన్నారు. స్థానికంగా నివాసం లేరని పదేపదే చంద్రబాబుపై వైసీపీ నేతలు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగన్ పులివెందులలో కూర్చుని పరిపాలన చేస్తున్నారా అని ప్రశ్నించారు. సీఎం హామీ ఇచ్చిన 66 కోట్ల రూపాయల అభివృద్ధి కుప్పంలో ఎక్కడా కనిపించడం లేదని విమర్శించారు. చంద్రబాబు చేసేది చెప్తారని, చెప్పింది చేస్తారన్నారు. రెండు రూపాయలకు సుజల నీరిస్తే కనీసం దాన్ని కొనసాగించలేని అసమర్థ పాలన వైసీపీది అన్నారు. ముందు కుప్పం ప్రజలకు గొంతు తడుపుకొనేందుకు గుక్కెడు నీరు ఇచ్చి తర్వాత మాట్లాడాలని హితవు పలికారు. టీడీపీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి స్థానికుడు కాదని చెబుతున్న ఎమ్మెల్సీ భరత్, ప్రస్తుతం ఎంపీగా ఉన్న రెడ్డెప్ప ఎక్కడి వారో చెప్పాలని నిలదీశారు. చంద్రబాబు కుప్పంలో ఓడిపోతే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని, చంద్రబాబు గెలిస్తే వైసీపీ నాయకులు మొత్తం రాజకీయ సన్యాసం చేస్తారా అని సవాల్ చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలకు నోచుకోని అత్రపల్లె



అత్రపల్లెలో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు, ఇళ్ళ మధ్య అపరిశుభ్రంగా మారిన డ్రైనేజీ

వి.కోట, మార్చి 27: మండల పరిధిలోని అత్రపల్లెలో మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుదీర్ఘ కాలంగా ఒకే కుటుంబం కొంగాటం పంచాయతీ సర్పంచులుగా కొనసాగుతున్నా అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. కనీసం డ్రైనేజీ సదుపాయమైనా సరిగా లేక ప్రధాన రహదారి పైనే మురుగునీటి ప్రవాహం కొనసాగుతోంది. అలాగే గ్రామానికి రెండు బోర్ల నుంచి తాగునీటి సరఫరా జరుగుతుండగా ఓ మోటారు మరమ్మతుకు గురై నాలుగేళ్ళ గడుస్తున్నా దానిని ఇప్పటివరకూ బాగుచేయకపోవడంతో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. ఉన్న ఒక్క బోరు నుంచి వచ్చే నీటి సరఫరా గ్రామానికి సరిపడలేదు. వీధి దీపాలు రాత్రి,పగలు తేడాలేకుండా వెలుగుతూనే ఉంటున్నాయి. కాలనీలో త్రీ ఫేస్ లైన్ ఇళ్ళపైనే వెళుతున్నా దానిని మార్చుచేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. గ్రామానికి తూర్పుదిశగా ఉన్న 0.69 సెంట్ల ప్రభుత్వ భూమిలో పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు పంపినా అది అమలుకు నోచుకోలేదు. పాఠశాల నాడు-నేడుకు ఎంపికైనా పనులపై నిఘా లేకపోవడంతో నిధులు దారి మళ్ళాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పాలకులు దృష్టి సారించి అత్రపల్లె అభివృద్ధికి బాటలు వేయాలని కోరుతున్నారు.

కోదండ రామస్వామి ఆలయంలో వైభవంగా మండలపూజ



ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న గల్లా దంపతులు

పూతలపట్టు, మార్చి 27: పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలో గల్లా కుటుంబీకులు నూతనంగా నిర్మించిన కోదండ రామస్వామి ఆలయంలో బుధవారం మండలపూజ అంగరంగ వైభవంగా జరిగింది. ఈ ఏడాది ఫిబ్రవరి 13, 14, 15 తేదీల్లో కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. మంగళవారం స్వామివారి ఆలయంలో అంకురార్పణ, కలశస్థాపన, కంకణధారణ, వాస్తుహోమం వంటి పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం కలశారాధన, నిత్య పూజ మహోత్సవాలు, మూర్తి హోమములు, శక్తి హోమం, పూర్ణాహుతి, పుణ్యతీర్థ పంచామృత అభిషేకం వంటి పలు రకాల పూజలు నిర్వహించారు. అనంతరం వేలాదిమంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అమరరాజా బ్యాటరీస్ సంస్థల యజమాని గల్లా రామచంద్ర నాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, గల్లా పద్మావతి, గౌరినేని రమాదేవి, ప్రముఖ రచయితలు నామినీ సుబ్రహ్మణ్యం, శాకం నాగరాజు, నాయకులు బడి సుధాయాదవ్, బాలకృష్ణారెడ్డి, స్థానిక సర్పంచ్ రాధాక్రిష్ణమ నాయుడు, ట్రస్టు సెక్రటరి గల్లా రాజశేఖర్, ట్రెజరర్ గల్లా రామా నాయుడు, సభ్యులు భానుమూర్తి నాయుడుతో పాటు పేటమిట్ట, పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

చిత్తూరు (సెంట్రల్), మార్చి 27: రక్తదానం ప్రాణదానంతో సమానమని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ఆర్ఆర్‌సీ, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మీరు దానం చేసే రక్తం ప్రాణాపాయంలోని వ్యక్తులకు ప్రాణం పోసేందుకు ఉపయోగపడుతుందని, ఆ విధంగా మీరు సమాజ సేవలో భాగస్వాములవుతున్నారని అభినందించారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ మెడికల్ అధికారి డాక్టర్ విజయకుమార్ పర్యవేక్షణలో కళాశాలకు చెందిన 40 మంది ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి భానుప్రకాష్, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ రమేష్ పండ్లను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి మేజర్ లోకనాథన్, సుబేదారు మేజర్ చైత్రి పాల్గొన్నారు.

బాబును కలిసిన సహచర విద్యార్థి

కార్వేటినగరం, మార్చి 27: పుత్తూరులో బుధవారం జరిగిన ప్రజాగళం కార్యక్రమంలో కార్వేటినగరానికి చెందిన టీడీపీ నాయకుడు కొండూరు త్యాగరాజు ఆ పార్టీ అధినేత చంద్రబాబును కలిశారు. ఎస్వీయూలో పీజీ చేసేటప్పుడు చంద్రబాబు, కొండూరు త్యాగరాజు ఇద్దరూ సహచర విద్యార్థులు కావడం విశేషం.

అర్ధగిరి హుండీ ఆదాయం రూ.14.79 లక్షలు



తవణంపల్లె, మార్చి 27: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో బుధవారం ఈవో హనుమంతరావు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపులో 108 రోజులకు గానూ రూ.14,79,624 నగదు లభించినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారి సుమనప్రియ, ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది, గ్రామీణ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

కొదలమడుగు చెక్‌పోస్టు తనిఖీ

బంగారుపాళ్యం, మార్చి 27: ఎన్నికల కోడ్ అమలుకావడంతో మద్యం, నగదు అక్రమ రవాణా అరికట్టేందుకు కొదలమడుగు గ్రామం వద్ద తమిళనాడు - ఆంధ్ర సరిహద్దు చెక్‌పోస్టును బుధవారం ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) టీమ్ తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శివశంకర్, శ్రీధర్ మాట్లాడుతూ అక్రమ మద్యం, నగదు ఆంధ్రలోకి ప్రవేశించకుండా వాహనాలను కట్టుదిట్టంగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో బెనర్జీరావు, రమేష్ పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

● ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో రవిరాజు

చిత్తూరు రూరల్, మార్చి 27: హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారిపై నిరంతరం నిఘా ఉంచాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో రవిరాజు వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ హైరిస్క్ ప్రెగ్నెన్సీ ట్రాకింగ్ మేనేజ్మెంట్ అనే అంశంపై గైనకాలజిస్టులు, వైద్యాధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాతాశిశు మరణాలు జరగకూడదని అన్నారు. అందు కోసం హైరిస్క్ గర్భిణుల పట్ల వైద్యాధికారులు, గైనకాలజిస్టులు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. వారిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని, మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారంపై సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. కాన్పు సమయంలో 108, 104 సేవలను ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలోని ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాలకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్టులు ఉషశ్రీ, మీనా షయ్యద్, జానకిరావు, ఎస్‌వో జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహాభారత మహోత్సవాలు

చిత్తూరు కల్చరల్, మార్చి 27: నగరపాలక పరిధిలోని 21వ డివిజన్ కుక్కలపల్లె లక్ష్మయ్య కండ్రిగ ద్రౌపది సమేత ధర్మరాజ పాండవాలయంలో గురువారం నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు మహాభారత మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పూల సుబ్రమణ్యం, అధ్యక్షులు కుమారస్వామి నాయుడులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీకృష్ణార్జున ద్రౌపది సమేత ధర్మరాజ పాండవుల అనుగ్రహం పొందాలని ఉత్సవ నిర్వాహకులు సిద్ధయ్య నాయుడు, హరిబాబు నాయుడు, కొల్లా రవి నాయుడు, రామచంద్రయ్య, గోవిందయ్య కోరారు.

బకాయిలు చెల్లిస్తే అపరాధ రుసుం రద్దు

పలమనేరు, మార్చి27 : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్ను చెల్లింపుపై అపరాధ రుసుం రద్దు చేశారని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు.కావున బకాయిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని వెంటనే మున్సిపల్ కార్యాలయంలో లేదా దగ్గరలో ఉన్న సచివాలయాల్లో చెల్లించాలని కోరారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో అనగా ఈనెల 29, 31తేదీల్లో కూడా మున్సిపల్ కార్యాలయంలోను, సచివాలయంలోను కౌంటర్లు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

పది పరీక్షలకు 26 మంది గైర్హాజరు

పలమనేరు, మార్చి27 : మండల పరిధిలో బుధవారం జరిగిన 10వ తరగతి సాంఘికశాస్త్రం పరీక్షలకు 26 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం తెలిపారు. మండలంలోని 6 పరీక్షా కేంద్రాల్లో 1345 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి వుండగా 1319 మంది హాజరయ్యారని వారు తెలిపారు. విద్యార్థులకు కావలసిన అన్ని మౌళిక సదుపాయాలు కల్పించామని తెలిపారు.

వృథాగా పోతున్న తాగునీరు



కల్లూరు, మార్చి 27: పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కొంగరవారిపల్లెకు అందిస్తున్న తాగునీటి పైపులైను 15 రోజులక్రితం దెబ్బతిని నీరు వృథాగా పోతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. కొంగరవారిపల్లె ప్రజల దాహార్తిని తీర్చేందుకు వడ్డిపల్లి సమీపంలోని బోరు నుంచి పైపులైను ద్వారా గ్రామ పంచాయతీ తాగునీళ్లు అందిస్తోంది. 15 రోజుల క్రితం పైపులైను మరమ్మతులకు గురికావడంతో ప్రజలు తాగునీటికి కష్టాలు పడుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రమేష్‌ను అడగగా తక్షణం మరమ్మతులు చేపడతామని తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

సోమల, మార్చి 27: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఉపాధి హామీ సిబ్బంది ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదని ఏపీడీ శ్రీనివాసులు తెలిపారు. బుధవార స్త్రీ శక్తి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో వికలాంగులకు తగిన ప్రాధాన్యత ఇచ్చి పనులు కల్పించాలన్నారు. వేసవి దృష్ట్యా పనుల వద్ద కూలీలకు తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో ఏపీవో దినకర్ బాబు, రిజ్వాన్, జేఈ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు



పుంగనూరు రూరల్, మార్చి27: ఆర్టీసీ ప్రయాణికులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు పుంగనూరు డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన వారికి లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరు డిపో నుంచి రాయచోటి, ముళబాగిల్, దొడ్డిపల్లె, తిరుపతి, మేటిమంద, కలికిరి మార్గాల్లో ప్రయాణించి లక్కీడిప్ ద్వారా ఎంపికైన ప్రయాణికులు వెంకట్రమణ, జమ్రూత్‌జాన్, లోకేశ్, మల్లికార్జున, బావాజాన్, పునీత్, సంజనారెడ్డి, బాషా తదితరులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు సంధ్య, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆవులపల్లెలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



శయనోత్సవంలో శ్రీవారు

సోమల, మార్చి 27: ఆవులపల్లెలో కొలువుదీరిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిసాయి. ఉదయం మూల విరాట్‌కు విశేష అలంకరణలు చేసి అభిషేకపూజలు నిర్వహించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ధ్వజావరోహణ, శయనోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. గోవింద మాల ధరించి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న యువకులను టీటీడీ అధికారులు, అర్చకులు అభినందించి తీర్థప్రసాదాలు అందజేశారు. పెద్దఉప్పరపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు, ఆవులపల్లె గ్రామాలకు చెందిన వారు ఉభయదారులు పాల్గొన్నారు.

అర్చకులపై దాడి శోచనీయం

పుంగనూరు, మార్చి 27: కాకినాడ భీమేశ్వరస్వామి ఆలయ అర్చకులపై వైసీపీ నాయకులు దాడులకు పాల్పడటం శోచనీయమని పుంగనూరు బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు కృష్ణమూర్తి ఖండించారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అర్చకులపై దాడి చేసి దుర్భాషలాడిన అధికారపార్టీ నేత సిరియాల చంద్రరావుపై క్రిమినల్ కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రోజు రోజుకు అన్ని వర్గాల ప్రజలపై దాడులు చేయడం సిగ్గుచేటు అన్నారు. దాడులు ఇలానే కొనసాగితే రానున్న రోజుల్లో ప్రజల్లో తిరుగుబాటు ఖాయమన్నారు.సమావేశంలో నాయకులు గంపల గంగరాజు, నాగప్ప, వెంకట్రామయ్య, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన మైనార్టీ నేత



పుంగనూరు, మార్చి27: కుప్పం పర్యటనలో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబును బుధవారం పుంగనూరుకు చెందిన మైనార్టీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ షాజహాన్‌బాషా కలిశారు. చంద్రబాబుకు పూలబొకే అందజేసి, పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీ గెలుపు కోసం ముస్లింలు కలసి పని చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజాగళానికి భారీగా తరలిన తెలుగు తమ్ముళ్లు



గుండ్రాజకుప్పం నుంచి తరలివెళుతున్న టీడీపీ, జన సైనికులు

నగరి, మార్చి 27: పుత్తూరులో బుధవారం జరిగిన టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజాగళం కార్యక్రమానికి నగరి పట్టణం, మండలాల నుంచి టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. నగరి మండల టీడీపీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శులు శ్రీనివాసన్, పురుషోత్తం నాయుడుల ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు తరలి వెళ్లారు. కార్యక్రమంలో రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, రాష్ట్ర టీడీపీ మహిళా అధికార ప్రతినిధి మీరా, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, సురేష్ నాయుడు గుణశేఖర్, జ్యోతి నాయుడు, నారాయణస్వామి నాయుడు, ధనంజయరాజు, ఉమాపతిరాజు, బీపీ ఆర్ముగం, వేణు, నాగరాజు, సురేష్, కన్ని వేలురెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయపురం: మండలంలోని 25 పంచాయతీల నుంచి సుమారు 3 వేల మందికి పైగా టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. బస్సులు, లారీలు, కార్లు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాల్లో ఎండను సైతం లెక్క లేయకుండా టీడీపీ శ్రేణులు వెళ్లారు. టీడీపీ, బీజేపీ, జనసేన కుటుంబ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

నింద్ర: మండలం నుంచి మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మూడు వేల మంది తెలుగు తమ్ముళ్లు తరలివెళ్లారు. జనసేన, బీజేపీ నుంచి కూడా నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. వీరిలో టీడీపీ నాయకులు వాసు, విజయ్‌కుమార్, గాలి రమేష్ నాయుడు, తేజేష్, బాబుయాదవ్, ఆనంద్‌రాజు, దొరస్వామి నాయుడు, పరదేశి, లోకనాథం నాయుడు, ప్రకాష్, మనోజ్ యాదవ్, జనసేన నాయకులు శివలింగం, బీజేపీ నాయకులు రమేష్, గుణశేఖర్ రెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ విజయానికి కలసిమెలసి పని చేద్దాం



మాట్లాడుతున్న పూతలపట్టు టీడీపీ అభ్యర్థి మురళీమోహన్

ఐరాల(కాణిపాకం), మార్చి 27: రాబోవు ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీ, బీజేపీ కార్యకర్తలు అందరూ కలసికట్టుగా పనిచేసి సైకిల్ విజయానికి కృషి చేద్దామని పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ పిలుపునిచ్చారు. బుధవారం కాణిపాకంలో టీడీపీ, జనసేన పార్టీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గద్దెనెక్కాలని ఆ పార్టీ నాయకులు ప్రజలకు మోసపూరిత మాటలు చెబుతున్నారన్నారు. ఎన్నికల్లో సైకిల్ విజయం కోసం కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కష్టపడి పని చేయాలన్నారు. తెలుగుదేశంపార్టీ విజయం సాధించగానే ప్రజల కష్టాలను తీర్చడానికి ఇంటింటికీ తిరుగుతామన్నారు.

జనసేన పార్టీలో చేరిన వైసీపీ సర్పంచ్



ఆరణి శ్రీనివాసులు సమక్షంలో జనసేన కండువా కప్పుకుంటున్న శ్రీహరి, అనుచరులు

బంగారుపాళ్యం, మార్చి 27: మండలంలోని రాగిమానిపెంట పంచాయతీ సర్పంచ్ తోట శ్రీహరి (వైసీపీ) బుధవారం తన అనుచరులతో కలిసి తిరుపతిలో చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ఈయనతో పాటు మాజీ వైస్ ఎంపీపీ తోట వేణుగోపాల్, సుమారు 50 మంది అనుచరులు కూడా జనసేనలో చేరారు.

క్షేత్రస్థాయిలోకి ఓటరు చైతన్య కార్యక్రమాలు

చిత్తూరు, మార్చి 27: చిత్తూరు నియోజకవర్గపరిధిలో సిస్టమ్యాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(స్వీప్) ద్వారా ఓటరు చైతన్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా చేపట్టాలని ఏఆర్వో, కమిషనర్ అరుణ చీఫ్ నోడల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. బుధవారం నగరపాలక కార్యాలయంలో స్వీప్ కార్యక్రమాల నిర్వహణపై నోడల్ టీం అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. స్వీప్ నోడల్ అధికారి చిన్నయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తిరువణ్ణామలై నుంచి తిరుమలకు పాదయాత్ర



కాలి నడకన తిరుమలకు వెళ్తున్న తమిళనాడు భక్తులు

గుడిపాల, మార్చి 27: తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై నుంచి తిరుమలకు కాలినడకన మండుటెండలో దైవదర్శనానికి వెళ్లడం ప్రతి సంవత్సరం ఆనవాయితీగా వస్తోందని తమిళనాడు వాసులు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం తొలుత 30 మంది భక్తులతో మొదలై ప్రస్తుతం 300 మంది భక్తులతో తిరుమలకు వెళుతున్నామన్నారు. వెంకటేశుడిని దర్శించుకోవడం వల్ల తమకు కష్టాలు దరిచేరవని, అందుకే ప్రతి ఏటా ఆనవాయితీగా వెళుతుంటామని చెప్పుకొచ్చారు.



పలమనేరులో బుధవారం జరిగిన ఎన్నికల శంఖారావం ప్రజాగళం బహిరంగ సభకు హాజరైన టీడీపీ అధినేత చంద్రబాబును హెలిప్యాడ్ వద్ద కలిసి సత్కరిస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్



పుత్తూరులో బుధవారం జరిగిన ప్రజాగళం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన చంద్రబాబును కలిసిన ఎస్వీ యూనివర్సిటీలో సహచర విద్యార్థి, కార్వేటినగరానికి చెందిన టీడీపీ నాయకుడు కొండూరు త్యాగరాజు

కేంద్ర బలగాల కవాతు

పూతలపట్టు, మార్చి 27: మండల పరిధిలోని ఎగువ పాలకూరు, దిగువ పాలకూరు, తలుపులపల్లి, పోటుకనుమ తదితర గ్రామాల్లో కేంద్ర బలగాలు బుధవారం కవాతు నిర్వహించాయి. పూతలపట్టు సీఐ సుదర్శన్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వేసుకునేందుకే ఈ కవాతు నిర్వహిస్తున్నామని తెలిపారు.

పాలసముద్రం: మండలంలోని ఆముదాల, సీఎంకండ్రిగ, పాలసముద్రం, సింహరాజుపురం బలిజకండ్రిగ గ్రామాల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ట్రైనీ డీఎస్పీ పవన్‌కుమార్, కార్వేటినగరం సీఐ సత్యబాబు, పాలసముద్రం ఎస్ఐ భారతి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు పలు గ్రామాల్లో కవాతు నిర్వహించాయి.

తవణంపల్లె: రానున్న ఎన్నికల నేపథ్యంలో చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి, తవణంపల్లె ఎస్ఐ సుధాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో మండలంలో సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. తవణంపల్లె పోలీసు స్టేషను పరిధిలోని కె.పట్నం, మోదలపల్లె, కర్ణంవాండ్లవూరు, కొత్తగొల్లపల్లె, నారసింహనపల్లె తదితర గ్రామాల్లో కవాతు నిర్వహించారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయండి



రాకేష్ రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నింద్ర, మార్చి 27: కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పీసీసీ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన నింద్రలో నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కార్యకర్తలు సైన్యంలా పనిచేసి కాంగ్రెస్ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పీసీసీ జనరల్ కార్యదర్శి బాబు, పీసీసీ సభ్యులు నటరాజ్ మొదలి, చిరంజీవి రెడ్డి, నాయకులు దేశయ్య, గిరి, లోహిత్‌రాజ్, రజనీ దేశప్ప, ఉదయ్, సుబ్రమణ్యం, కైలాసం పాల్గొన్నారు.

ఇద్దరిపై చీటింగ్ కేసు

చిత్తూరు, మార్చి 27: చీటీల పేరుతో పలువురుని మోసం చేసిన ఇద్దరిపై రెండో పట్టణ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ ఉలసయ్య వివరాల మేరకు.. చిత్తూరు నగరం రామ్‌నగర్ కాలనీకి చెందిన జమీల, నిజాముద్దీన్‌లు రెండేళ్ల క్రితం కాలనీలో చీటీలు వేశారు. వీరిని నమ్మి చాలా మంది రూ.60 లక్షల వరకు చీటీలు కట్టారు. చీటీ డబ్బులను తీసుకొని వీరు బెంగళూరుకు వెళ్లిపోయారు. రెండేళ్ల తరువాత కాలనీకి రావడంతో బాధితులంతా వారిపై ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అవినీతికి నిదర్శనం వైసీపీ

గుడిపాల, మార్చి 27: అవినీతికి నిలువెత్తు నిదర్శనం వైసీపీయేనని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, సీనియర్ నాయకుడు వాసుదేవ రెడ్డి విమర్శించారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ అడ్డదారులు తొక్కి అధికారం చేపట్టాలని వైసీపీ నాయకులు ఎత్తుకు పైఎత్తు వేస్తున్నారని ఆరోపించారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి రేణిగుంట సమీపంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు పలు తాయిలాలను గోడౌన్‌లో దాయడం ఎంతవరకు సబబని వారు ప్రశ్నించారు. ఇవన్నీ ఎన్నికల కమిషన్ అధికారులకు కనిపించడంలేదా అని అన్నారు. టీడీపీ నాయకులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టించినప్పుడే అధికారులకు తెలిసిందా అని దుయ్యబట్టారు. వైసీపీ నేతలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా రానున్న ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమని వారు స్పష్టం చేశారు.

కోదండ రామస్వామి ఆలయంలో

వైభవంగా మండలపూజ



ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న గల్లా దంపతులు

పూతలపట్టు, మార్చి 27: పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలో గల్లా కుటుంబీకులు నూతనంగా నిర్మించిన కోదండ రామస్వామి ఆలయంలో బుధవారం మండల పూజ అంగరంగ వైభవంగా జరిగింది. ఈ ఏడాది ఫిబ్రవరి 13, 14, 15 తేదీల్లో కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. మంగళవారం స్వామివారి ఆలయంలో అంకురార్పణ, కలశస్థాపన, కంకణధారణ, వాస్తుహోమం వంటి పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం కలశారాధన, నిత్య పూజ మహోత్సవాలు, మూర్తి హోమములు, శక్తి హోమం, పూర్ణాహుతి, పుణ్యతీర్థ పంచామృత అభిషేకం వంటి పలు రకాల పూజలు నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అమరరాజా బ్యాటరీస్ సంస్థల యజమాని గల్లా రామచంద్ర నాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, గల్లా పద్మావతి, గౌరినేని రమాదేవి, ప్రముఖ రచయితలు నామినీ సుబ్రహ్మణ్యం, శాకం నాగరాజు, నాయకులు బడి సుధా యాదవ్, బాలక్రిష్ణారెడ్డి, స్థానిక సర్పంచ్ రాధాక్రిష్ణమ నాయుడు, ట్రస్టు సెక్రటరి గల్లా రాజశేఖర్, ట్రెజరర్ గల్లా రామా నాయుడు, సభ్యులు భానుమూర్తి నాయుడుతో పాటు పేటమిట్ట, పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పసుపు చీరలు, పసుపు జెండాలతో చంద్రబాబుకు

నగరి మహిళల స్వాగతం



చలపతితో మాట్లాడుతున్న చంద్రబాబు

నగరి, మార్చి 27: ప్రజాగళం కార్యక్రమంలో పాల్గొనేందుకు పుత్తూరుకు విచ్చేసిన టీడీపీ అధినేత చంద్రబాబుకు నగరి పట్టణ, తెలుగు మహిళలు, యువత పసుపు దుస్తులు ధరించి, పసుపు జెండాలు చేత బట్టి ఘనస్వాగతం పలికారు. హెలిప్యాడ్ నుంచి పుత్తూరు పట్టణానికి వస్తున్న సమయంలో వీరు ఆయనకు స్వాగతం పలికారు. పసుపు దళాన్ని చూసిన చంద్రబాబు తన వాహనాన్ని ఆపి రామానుజం చలపతి, మాజీ కౌన్సిలర్ లతను పలకరించారు. ఈ సందర్భంగా పసుపు రంగుతో కూడిన వినాయక ప్రతిమను చంద్రబాబుకు బహుమానంగా అందించి ఎన్నికల్లో విజయం సాధించి ముఖ్యమంత్రిగా రావాలని కోరినట్లు రామానుజం చలపతి తెలిపారు. ఇందుకు స్పందించిన చంద్రబాబు మాట్లాడుతూ పార్టీకి పనిచేయ్, నేనున్నా నీకు అని చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. వ్యక్తిగతంగా కలవాలని అడిగితే సమయం చూసి చెబుతాను.. విజయవాడ రమ్మని అన్నట్లు చలపతి తెలిపారు.

నిరుపేదలను ఆదుకోవడమే 'గురజాల' ధ్యేయం



మంచినీళ్లగుంటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న చెన్నకేశవులు నాయుడు

గుడిపాల, మార్చి 27: నిరుపేదలను ఆదుకోవడమే టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడు ధ్యేయమని జీజేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు, గురజాల ప్రతిమ, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. బుధవారం మండలంలోని నారగల్లు, ఏఎల్ పురం, పాపసముద్రం, గుడిపాల పంచాయతీలో వేర్వేరుగా ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పిలిస్తే పలికే నాయకుడిగా ఉన్న జగన్మోహన్ నాయుడును గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షుడు రూప్‌కుమార్, మాజీ జడ్పీటీసీ సుమతి, మాజీ ఎంపీపీ దీపశ్రీ, మహిళా అధ్యక్షురాలు ఉదయ, ఎంపీటీసీ విజయలక్ష్మి, టీడీపీ నాయకులు హరిప్రసాద్, శేఖర్, ఐజాక్, గజేంద్ర, అర్జున్, విక్టోరియా, విల్సన్, మధుసూదన్ నాయుడు, బలరామ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న పీవీకేఎన్ కళాశాల విద్యార్థులు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 27: రక్తదానం ప్రాణదానంతో సమానమని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ఆర్‌ఆర్‌సీ, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మీరు దానం చేసే రక్తం ప్రాణాపాయంలోని వ్యక్తులకు ప్రాణం పోసేందుకు ఉపయోగపడుతుందని అభినందించారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ మెడికల్ అధికారి డాక్టర్ విజయకుమార్ పర్యవేక్షణలో కళాశాలకు చెందిన 40 మంది ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు రక్తదానం చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి భానుప్రకాష్, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ రమేష్ పండ్లను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి మేజర్ లోకనాథన్, సుబేదారు మేజర్ చైత్రి, అధ్యాపకులు నవనీశ్వర్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు విలువైంది: డీఆర్‌డీఏ పీడీ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పీడీ తులసి

చిత్తూరు (సెంట్రల్), మార్చి 27: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని డీఆర్‌డీఏ పీడీ తులసి పేర్కొన్నారు. బుధవారం స్థానిక విజయం డిగ్రీ కళాశాలలో తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకునే విద్యార్థులకు ఓటు హక్కు, విలువ అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సి-విజిల్, ఓటర్ హెల్ప్‌లైన్, సాక్ష్యం యాప్‌ల వాడకాన్ని వివరించారు. 18 సంవత్సరాలు నిండి ఓటరు కార్డు లభించని విద్యార్థుల వివరాలు సేకరించారు. కళాశాలలో ఓటు నమోదు కార్యక్రమానికి కార్యకర్తలుగా వ్యవహరించిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం ఓటుపైన అవగాహన కల్పించే లఘు చిత్రాలను విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి ప్రదీప్, జేడీఎం సరితారెడ్డి, విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, అధ్యాపకులు రాజగోపాల్, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

కాణిపాకం ఎస్ఐకి అవార్డు



రామ్మోహన్

ఐరాల(కాణిపాకం): కాణిపాకం ఎస్ఐ రామ్మోహన్‌కు డీజీపీ కమెండేషన్ డెస్క్ అవార్డు, బ్రాంజ్ మెడల్ వచ్చింది. ఆయన బికొత్తకోటలో ఎస్ఐగా పని చేసినప్పుడు కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం రవాణాను అరికట్టినందుకు, అలాగే రెండు హత్య కేసులను పరిశోధించి ఛేదించినందుకు, దొంగతనం కేసులో ఆస్తులను పరిశోధించి సొత్తు స్వాధీనం చేసిన కేసుకు సంబంధిచి ఈ అవార్డు వచ్చింది.

ఓటుహక్కు వినియోగం పై ర్యాలీ

నగరి, మార్చి 27: ఓటుహక్కు వినియోగంపై నగరి పట్టణ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా లీడ్ మేనేజర్ సుభాష్ ఆధ్వర్యంలో నగరి మెప్మాకు చెందిన మహిళలు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్, మెప్మా జిల్లా సమన్వయకర్త బాబా, పట్టణ మెప్మా అధికారి సునీత, మహిళలు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై వడ్డీమాఫీ ఇక నాలుగు రోజులే

చిత్తూరు, మార్చి 27: చిత్తూరు నగరపాలక సంస్థలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులపై వడ్డీమాఫీ గడువు ఇక నాలుగు రోజులు మాత్రమే ఉందని, ఈ అవకాశాన్ని పన్నుదారులు ఉపయోగించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరానికి సంబంధించిన పన్నును ఒకేసారి చెల్లించిన వారికి వడ్డీమాఫీ ఉంటుందన్నారు. బకాయిల మొత్తాన్ని ఒకేసారి చెల్లించాల్సి ఉంటుందన్నారు.

అర్ధగిరి హుండీ ఆదాయం రూ.14.79 లక్షలు



తవణంపల్లె, మార్చి 27: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో బుధవారం ఈవో హనుమంతరావు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపులో 108 రోజులకు గానూ రూ.14,79,624 నగదు లభించినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారి సుమనప్రియ, ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది, గ్రామీణ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మహాభారత మహోత్సవాలు

చిత్తూరు కల్చరల్, మార్చి 27: నగరపాలక పరిధిలోని 21వ డివిజన్ కుక్కలపల్లె లక్ష్మయ్య కండ్రిగ ద్రౌపది సమేత ధర్మరాజ పాండవాలయంలో గురువారం నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు మహాభారత మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పూల సుబ్రమణ్యం, అధ్యక్షులు కుమారస్వామి నాయుడులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు సిద్ధయ్య నాయుడు, హరిబాబు నాయుడు, రవి నాయుడు, రామచంద్రయ్య, గోవిందయ్య కోరారు.

వైసీపీ ఓటమి ఖాయం: దొరబాబు



టీడీపీలో చేరిన వైసీపీ మాజీ కార్పొరేటర్ అన్నపూర్ణ తదితరులు

చిత్తూరు సిటీ, మార్చి 27: వచ్చే ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయమని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో నగరంలోని 8వ డివిజన్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ అన్నపూర్ణ తన అనుచరులతో దొరబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. దొరబాబు మాట్లాడుతూ వైసీపీ అభ్యర్థులకు ఓటమి భయం పట్టుకుందని చెప్పారు. గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. ఇప్పుడు ఏముఖం పెట్టుకుని ప్రజలను ఓట్లడుగుతారని ప్రశ్నించారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్రానికి పూర్వ వైభవం రావాలన్నా, ప్రజలు సంతోషంగా ఉండాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లువేసి ఉమ్మడి టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్‌ను గెలిపించాలని కోరారు. మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు కాజూరు బాలాజి, త్యాగరాజన్, వెంకటేష్ యాదవ్, సుబ్బి, అశోక్, ఈశ్వర్, కంద, శంకర్, రాజశేఖర్, దుర్గాచౌదరి,రాణి, వరలక్ష్మి, ప్రియాంక, కదిరివేలు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

● మాజీ మేయర్ కటారి హేమలత

చిత్తూరు సిటీ, మార్చి 27: టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేద్దామని మాజీ మేయర్, టీడీపీ నగర అధ్యక్షురాలు కటారి హేమలత పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో నగరంలోని క్లస్టర్, యూనిట్ ఇన్చార్జ్‌లు, 50 డివిజన్ల పార్టీ అధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలని కోరారు. గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులు అనేక ఇబ్బందులు పడ్డారని చెప్పారు. వైసీపీ నేతల అరాచకాలు, అన్యాయాలు, దౌర్జన్యాలు, కక్షలకు ఎన్నో కుటుంబాలు బలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీని ఇంటికి సాగనంపే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు నేతలు వెంకటేష్ యాదవ్, సుబ్బి, అశోక్, ఈశ్వర్, కంద, శంకర్, రాజశేఖర్, దుర్గాచౌదరి,రాణి, వరలక్ష్మి, ప్రియాంక, కదిరివేలు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

● ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో రవిరాజు

చిత్తూరు రూరల్, మార్చి 27: హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారిపై నిరంతరం నిఘా ఉంచాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో రవిరాజు వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ హైరిస్క్ ప్రెగ్నెన్సీ ట్రాకింగ్ మేనేజ్మెంట్ అనే అంశంపై గైనకాలజిస్టులు, వైద్యాధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాతాశిశు మరణాలు జరగకూడదని అన్నారు. అందు కోసం హైరిస్క్ గర్భిణుల పట్ల వైద్యాధికారులు, గైనకాలజిస్టులు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. వారిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని, మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. దీనిపై పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలోని ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాలకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్టులు ఉషశ్రీ, మీనా షయ్యద్, జానకిరావు, ఎస్‌వో జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి వీడాలి

చిత్తూరు రూరల్, మార్చి 27: పారిశుధ్య కార్మికుల పట్ల మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వీడాలని ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం ఎస్టీయూ కార్యాలయంలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు మరణిస్తే దహన క్రియలకు, మట్టి ఖర్చులు మంజూరు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం తగదన్నారు. అలాగే వారికి ఇవ్వాల్సిన యూనిఫాం, చెప్పులు, సోపులు, నూనె గత 4 సంవత్సరాలుగా ఇవ్వడం లేదని ఆరోపించారు. కనీసం కార్మికుల ఇచ్చే పనిముట్లు కూడా సరఫరా చేయడం లేదని, దీని కారణంగా కార్మికులు ప్రమాదాలు బారిన, అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. యూనియన్ నాయకులు వాసు, జయశంకర్, సురేష్, వినాయక, పరదేశి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కొదలమడుగు చెక్‌పోస్టు తనిఖీ



అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

బంగారుపాళ్యం, మార్చి 27: ఎన్నికల కోడ్ అమలుకావడంతో మద్యం, నగదు అక్రమ రవాణా అరికట్టేందుకు కొదలమడుగు గ్రామం వద్ద తమిళనాడు - ఆంధ్ర సరిహద్దు చెక్‌పోస్టును బుధవారం ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) టీమ్ తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శివశంకర్, శ్రీధర్ మాట్లాడుతూ అక్రమ మద్యం, నగదు ఆంధ్రలోకి ప్రవేశించకుండా వాహనాలను కట్టుదిట్టంగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో బెనర్జీరావు, రమేష్ పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

చిత్తూరు రూరల్, మార్చి 27: నవసమాజ నిర్మాణానికి ఓటు వజ్రాయుధంలా పనిచేస్తుందని చిత్తూరు మండల ఏపీఎం విజయభాస్కర్ తెలిపారు. గురువారం చిత్తూరు మహిళా సమాఖ్య కార్యాలయంలో ఓటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒక్క ఓటే కదా వేయకపోతే ఏమవుతుందిలే అనుకుంటే పొరపాటేనన్నారు. ఒక్క ఓటు ఓటమి, గెలుపులను నిర్ణయిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటు కలిగి ఉండటం గొప్ప కాదని, దానిని ఉపయోగించినప్పుడే విలువ ఉంటుందని తెలిపారు. అర్హులందరూ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం మహిళలు మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు.